క్లుప్తంగా

నేడు వలంటీర్లకు పురస్కారాల ప్రదానం

నాగాయలంక: అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం నాగాయలంకలో పర్యటిస్తారని ఎంపీడీఓ వేమూరి శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కె.పాలెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటలకు మండలంలోని వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తారని చెప్పారు.

బాటసారులకు అన్నదానం

నాగాయలంక: దత్త హ్యూమన్ సర్వీసు వలంటీర్ల ఆధ్వర్యంలో నాగాయలంక ప్రధాన కూడలిలో శుక్రవారం 200 మంది బాటసారులకు షేర్ యువర్ ఫుడ్ కార్యక్రమం పేరుతో అన్నసేవ–సచ్చిదానందసేవ నిర్వహించారు. మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దత్త మెడికల్స్ యజమాని చిట్టా శేఖర్ ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా శాంతి కల్యాణం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో ఇటీవల ప్రతిష్ఠోత్సవం జరిగిన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం 16 రోజుల పండుగ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. గ్రామంలోని 36 జంటలు పీటలపై కూర్చోగా నూతన ఆలయంలో ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు, నాగాయలంక పీఏసీఎస్ అధ్యక్షుడు ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, మెండు భాస్కరరావు, ముమ్మారెడ్డి సత్యనారాయణ, భోగాది మురళి, మలిశెట్టి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భావనారుషి స్వామి కల్యాణం



పెడన: స్థానిక కొలుకులవారి వీధిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి వారి దేవస్థానం తొమ్మిదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శివశ్రీ ఆయిలూరి జైకిషోర్ ఈశాన శివాచార్య ఆధ్వర్యంలో విట్టంశెట్టి లీలా వెంకట సుబ్రహ్మణ్యం, రాణి దంపతులచే స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. తొలుత స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ వారు పర్యవేక్షించారు.

117 మందికి ఉద్యోగాలు

మచిలీపట్నంటౌన్: బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో శుక్రవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 117 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఐటీఐలో వివిధ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ఎల్అండ్‌టీ, స్కై ఫ్రీ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (సోలార్) కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎల్ అండ్ టీ సంస్థ 82 మందిని, స్కై ఫ్రీ సంస్థ 35 మందిని ఎంపిక చేసింది. వీరందరికీ త్వరలోనే ప్లేస్‌మెంట్ చూపుతామని చెప్పారు. కార్యక్రమాన్ని కృష్ణవేణి ఐటీఐ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కొత్తగుండు రమేష్ పర్యవేక్షించారు.

అగ్ని బాధితుడికి సాయం



కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సొసైటీ మండల శాఖ చేయూతనిచ్చింది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ రంగారావు నివాసగృహం, మేకల చావిడి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గురువారం కాలిపోయింది. రెడ్‌క్రాస్ మండల శాఖ సభ్యులు శుక్రవారం బాధితులను పరామర్శించారు. సొసైటీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి గృహోపకరణాలు, నూతన దుస్తులు, కూరగాయలు అందించారు. బడే కృష్ణ సైకిల్ షాపు సహకారంతో 25 కిలోల బియ్యం అందించారు. సొసైటీ మండలాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, సభ్యులు కొండవీటి సురేష్, రేపల్లె యోగప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరాలతో మేలు

తోట్లవల్లూరు: వైఎస్సార్ కంటి వెలుగు శిబిరాలతో అవ్వా, తాతలకు మేలు కలుగుతోందని ఆప్తాల్మిక్ ఆఫీసర్ వి.వి. రాజేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని దేవరపల్లి శివారు పాములపాటివారిపాలెంలో వైఎస్సార్ కంటి వెలుగు శిబిరం (ఫేజ్ 3) శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా అరవై ఏళ్లు నిండిన అవ్వా, తాతలకు కంటి పరీక్షలు చేశారు.

అన్ని వర్గాలకు జగన్ ప్రభుత్వం అండ



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యేలు డీఎన్ఆర్, సింహాద్రి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- బండికోళ్లంకలో గడప గడపకు మన ప్రభుత్వం

కొక్కిలిగడ్డ(మోపిదేవి): అన్ని వర్గాల ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా ఉంటోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కొక్కిలిగడ్డ గ్రామ సచివాలయం పరిధి బండికోళ్లంక గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ కన్వీనర్ రాయన సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు 160 గృహాలను సందర్శించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ప్రజలకు మంచి చేస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని కోరారు. ప్రధానంగా అంతర్గత రహదారులు వేయించాలని గ్రామస్తులు కోరారు. బండికోళ్లంక వెంకట నాంచారమ్మ భర్త జయరావు మృతి చెంది ఆరేళ్లు కాగా, ఆయన పేరున ఉన్న 30 సెంట్ల భూమి తన పేరున బదిలీ చేయించి రైతుభరోసా ఇప్పించాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా రెవెన్యూ అధికారులు కనికరించడం లేదని ఎమ్మెల్యేకు వివరించింది. వీఆర్‌ఓ నీల్‌కాంత్‌ను పిలిచి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే సింహాద్రి సూచించారు. సమస్యల పరిష్కారానికే జగనన్న ప్రజాప్రతినిధులు, అధికారులను గ్రామాల్లోకి పంపారని, మరోసారి దీవించి జగనన్నకు అండగా నిలవాలని కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీరవెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి), పీఏసీఎస్ చైర్‌పర్సన్లు ఆది రాంబాబు, తుటారం కృష్ణ, రాజులపాటి నాగేశ్వరరావు, మోర్ల శ్రీనివాసరావు, మీసాల చిట్టిబాబు, కేసాని వెంకటేశ్వరరావు, పందుల అశోక్, వాసుపల్లి కోటేశ్వరరావు, పెరికే కృష్ణంరాజు, బండికోళ్ల పసి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ వ్యవస్థ పేదలకు వరం

ఘంటసాల(అవనిగడ్డ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ వ్యవస్థ పేదలకు వరంగా నిలుస్తోందని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం ఘంటసాలలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కైకలూరు ఎమ్మెల్యే డీఎన్ఆర్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన వెంటనే ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలు, గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, సింహాద్రి రమేష్‌బాబు వలంటీర్లకు పురస్కారాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఎంపీపీ వేమూరి రజనీకుమారి, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మల మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, ఎంపీడీఓ కేవీ సుబ్బారావు, తహసీల్దార్ రామానాయక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

స్వామిత్వలో పొరపాట్లకు తావులేకుండా చర్యలు

స్వామిత్వ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ సిరి



అధికారులతో మాట్లాడుతున్న డాక్టర్ సిరి

పెడన: స్వామిత్వ ద్వారా భూ లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించుకునేలా కేంద్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 200 గ్రామాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీ సర్వే చేసి రికార్డులను తయారు చేసిందని స్వామిత్వ రాష్ట్ర ప్రత్యేకాధికారి డాక్టర్ సిరి అన్నారు. శుక్రవారం ఉదయం ఆమె డీపీఓ నాగేశ్వరనాయక్‌తో కలిసి పెనుమల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. పెడన మండలంలో పైలట్ ప్రాజెక్టులుగా నేలకొండపల్లి, కుమ్మరిగుంట గ్రామాల్లో స్వామిత్వ పూర్తి కావడంతో వాటికి సంబంధించిన రికార్డులను, మ్యాపింగ్, డ్రోన్ కెమెరాలతో స్వీకరించిన ఫొటో ఇమేజ్‌లు తదితర వాటిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సిరి మాట్లాడుతూ కేంద్ర బృందం స్వామిత్వను పరిశీలించేందుకు రానుందని చెప్పారు. స్వామిత్వ వల్ల ప్రస్తుతం ఉన్న భూముల సరిహద్దులు, ఎవరి ఆస్తులు అనే విషయంలో స్పష్టత వస్తుందన్నారు. పూర్వీకుల ఆస్తులున్నా వాటికి సంబంధించి ఆధారాలను పరిశీలించిన అనంతరం పూర్తి హక్కుదారులైన వారికి రికార్డులు లేకపోయినా స్వామిత్వ వల్ల రికార్డులు కూడా దక్కుతాయని చెప్పారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకోవడం సులభతరమవుతుందన్నారు. స్వామిత్వ ఉపయోగాలను వివరించారు. జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వరనాయక్ మాట్లాడుతూ కృష్ణా జిల్లాలో 40 గ్రామాలను స్వామిత్వకు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని చెప్పారు. పూర్తిస్థాయిలో రికార్డులు తయారు చేశామని, ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. రానున్న కాలంలో పూర్తిస్థాయిలో వెబ్‌సైట్ ద్వారానే లావాదేవీలు, క్రయవిక్రయాలు జరుపుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. మచిలీపట్నం డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచ్‌లు గరికిపాటి వెంకట రామానాయుడు, వుచా వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ జయరామ్, సచివాలయ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అమ్మవారికి నైవేద్యాల సమర్పణ



అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

అడపావారిపాలెం(మోపిదేవి): అడపావారిపాలెంలోని అమ్మవారి తల్లి సంబరం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అడపావారి ఆడపడుచులు పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అడపావారి వంశీకులు, ఆడపడుచుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అడపా రాంబాబు, అడపా నాగేశ్వరరావు, అడపా గురవయ్య, అడపా సాయిబాబు పర్యవేక్షించారు.

ఉపాధి నిధులు పెంచాలి

కురుమద్దాలి(పామర్రు): ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని, దీనికి నిధులు పెంచాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకురాలు వి. శివ నాగమణి అన్నారు. కురుమద్దాలి, జమీగొల్వేపల్లి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శుక్రవారం పరిశీలించి అక్కడి కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్‌లో రూ. 30 వేల కోట్లు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కోత విధించిందన్నారు. భవిష్యత్‌లో 'ఉపాధి'ని రద్దు చేసే ఆలోచలో కేంద్రం ఉందన్నారు. 200 రోజుల పని దినాలు ఇవ్వాలని, వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, మేట్లకు పదివేల రూపాయల వేతనం ఇవ్వాలని, ఎఫ్ఏలను పర్మినెంట్ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 29న మచిలీపట్నం కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఒగుడు గంగాధర ప్రసాద్, ముళ్లపూడి విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సభ్యుల వాగ్వాదం



సభ్యుల మధ్య వాగ్వివాదం

మోపిదేవి: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం సభ్యుల వాగ్వాదంతో దద్దరిల్లింది. సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కె. కొత్తపాలెం గ్రామ కార్యదర్శి పనితీరుపై, బదిలీ ప్రక్రియ ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నందున సమావేశం సజావుగా సాగేందుకు సభ్యులు సహకరించాలని ఎంపీపీ కోరారు. అసరా నగదు అందరికీ అందలేదని, రైతులకు ధాన్యం సొమ్ము చెల్లించలేదంటూ ప్రభుత్వంపై టీడీపీ సభ్యులు విమర్శలు గుప్పించారు. నాగాయితిప్ప సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆసరా నగదు మండలంలో అందరికీ ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. గత మండల పరిషత్ సమావేశంలో కూడా ఆసరా సొమ్ము చెల్లించలేదని ఆరోపించారని, టీడీపీ వర్గీయులు బాయ్‌కాట్ చేస్తే సమావేశాన్ని పూర్తిగా వాయిదా వేయడాన్ని తప్పు పట్టారు. కార్యదర్శిపై కోపంతో సమావేశాన్ని వాయిదా వేయడం ఏమిటని, కనీసం నోటీసు కూడా అధికారులకు ఇవ్వకుండా ఎలా వాయిదా వేస్తారని ప్రశ్నించారు. దీంతో సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎంపీపీ కల్పించుకుని ఇరువర్గాలను శాంతింప జేశారు. ఈఓపీఆర్‌డీ అరుణకుమారి, ఎంఈఓ కె. రాజ్‌కుమార్, ఇరిగేషన్ ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఎంపీడీఓ పార్వతి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పర్యావరణ పరిరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అటవీ శాఖాధికారులు

మచిలీపట్నంటౌన్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే కృషి చేయాలని అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్లు ఎం. వెంకటేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, తద్వారా వాతావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు కోలాటం, రన్నింగ్ గేమ్స్ ఆడారు. భగవద్గీత శ్లోకాలు, ధ్యానం, యోగా చేయించారు. నగరంలోని ఈడేపల్లి, చిలకలపూడి గ్రంథాలయాల్లో కూడా విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఉప గ్రంథాలయాధికారి ఎంవీడీటీ నగేష్ పర్యవేక్షించారు.

దేవాలయ పనుల పరిశీలన



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉంచిన విగ్రహాలను తిలకిస్తున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం ఎన్.గొల్లపాలెం గ్రామంలో సుమారు రెండు కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న భగవాన్ శ్రీకృష్ణ, సరస్వతీమాత దేవాలయాల పనులను వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలోని ఓ భక్తుడు ఆలయ నిర్మాణానికి ఎకరం భూమితో పాటు లక్ష వరకు నగదు అందజేయడంతో పనులు ప్రారంభించామన్నారు. గ్రామస్తుల విరాళాలతో పనులు సాగాయని చెప్పారు. బందరు ఎమ్మెల్యే పేర్ని నాని చొరవ తీసుకుని ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి కావడానికి సహకరించిన పేర్ని నానికి కృతజ్ఞతలు తెలిపారు.

31న ఆలయ ప్రారంభోత్సవం

ఈనెల 31వ తేదీన త్రిదండి రామానుజ చినజీయర్ స్వామీజీ చేతులమీదుగా శిలావిగ్రహ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభాల ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు. ఈనెల 29న అన్నమయ్య సంకీర్తన విభావరి, 30న వేదపండితులతో యజ్ఞయాగాదులు, శిలావిగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామని వివరించారు.

● ఆత్మీయ స్వాగతం



గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం వెంకటపాలెంలో పేదలకు ఇళ్ల పట్టాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం అందజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక స్వాగతం పలికి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కోనలో గాలివాన బీభత్సం

- ఎగిరిపోయిన గృహాల కప్పులు
- పాక్షికంగా దెబ్బతిన్న గోడలు



బాధితులకు ధైర్యం చెబుతున్న జేసీ అపరాజితసింగ్, పేర్ని కిట్టు



గాలివానకు ఇల్లు కూలిపోయిన బాధితురాలితో మాట్లాడుతున్న పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: బందరు మండలం కోన గ్రామంలో గురువారం అర్ధరాత్రి వర్షంతో పాటు వీచిన గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. గ్రామంలోని పలు గృహాల పై కప్పులు గాల్లోకి ఎగిరాయి. మరి కొన్ని గృహాల గోడలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. బాధితులు పలువురు ఇళ్లను వదిలి పక్క ఇళ్లల్లోకి వెళ్లి తలదాచుకున్నారు. గ్రామస్తులు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో గ్రామస్తులంతా ఊపిరి పీల్చుకున్నారు. విషయాన్ని తెలుసుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శుక్రవారం గ్రామానికి వెళ్లి గృహాలను పరిశీలించారు. బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి బాధితులందరికీ సత్వర సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు అందరూ గ్రామంలోని పాఠశాలలో తలదాచుకునేందుకు అవకాశం కల్పించారు. అక్కడే అందరికీ భోజన వసతి ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తరఫున సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జేసీ అపరాజిత సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సత్వర న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామన్నారు. బందరు ఆర్డీఓ ఐ కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబును గ్రామానికి పిలిచి తక్షణమే బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ అపరాజిత్‌సింగ్, పేర్ని కిట్టు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుమాని నాగేశ్వరమ్మ, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం

ఎమ్మెల్యే పేర్ని నాని



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థుల చదువుకు అవసరమైన ఆర్థిక చేయూతను అందిస్తున్న దాతల సాయం అభినందనీయమని బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. స్థానిక నాయిని లక్ష్మణగాంధీ ఇంటి వద్ద ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘం ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఆకుల శేషుకుమార్, లావణ్యలక్ష్మీలకు ప్రాక్టికల్ ట్రెనింగ్ కోసం రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను పేర్ని నాని శుక్రవారం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన మాదిరెడ్డి జగన్నాథం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిన రూ. 50 వేల విలువైన రెండు చెక్కులను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. ఆదివెలమ సంఘం ప్రతినిధులు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, అంకాల వెంకట సుబ్బారావు, మాదిరెడ్డి రమేష్, ఈశ్వర్, లక్ష్మీ, వీరబాబు పాల్గొన్నారు.

నిర్భయానంద ఆరాధనోత్సవాలు ప్రారంభం



స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్న విద్యాసాగర్ గురూజీ, బంగారుబాబు

పాగోలు(చల్లపల్లి): పాగోలులోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలో నిర్భయానంద స్వామి వారి ప్రథమ ఆరాధన – విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రాతూరి విద్యాసాగర్ గురూజీ – శారద దంపతులు, పాగోలు ఎంపీటీసీ మేకా సత్యనారాయణ ప్రసాద్ (బంగారుబాబు)–విజయ దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులచే ఉదయం గోపూజ, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధన, దీక్షాధారణ, అంకురార్పణ, వేద పారాయణ, సాయంత్రం వాస్తు పర్యగ్నికరణ, అగ్ని మథనం, వాస్తు, నక్షత్ర, యోగినీ, క్షేత్రపాల, గ్రహ మంటపాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిర్భయానంద స్వామి శిష్యులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 28వ తేదీ ఉదయం 10.45 గంటలకు నిర్భయానంద స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుంది.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హారిక

మొవ్వ: ప్రజా సమస్యలను అధికారులు, ఎమ్మెల్యే, ఎంపీ, జెడ్పీ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకు రావడమే కాకుండా వాటి పరిష్కారానికి చొరవ చూపాల్సిన బాధ్యత ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై ఉందని కృష్ణా జిల్లా చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. మండల కేంద్రం మొవ్వలో శుక్రవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్‌తో కలిసి జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని, అందిస్తున్న సంక్షేమాన్ని వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హారిక మాట్లాడుతూ దేశంలోని 28 రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా సచివాలయ, వలంటరీ వ్యవస్థలను ప్రవేశ పెట్టి సంక్షేమ పథకాల అమలులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు. అభివృద్ధి అంటే అద్దాలసౌధాలు కాదని, ప్రతి వ్యక్తి, కుటుంబానికి సంక్షేమం పథకాలు అందించి తద్వారా వ్యక్తి, కుటుంబం, గ్రామాలు, జిల్లాలు అలా రాష్ట్రాభివృద్ధి సాధిస్తేనే నిజమైన అభివృద్ధి అన్నారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. మెడికల్ అండ్ హెల్త్ అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, ఎంపీడీఓ జి.సుధాప్రవీణ్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

50 శాతం రాయితీపై జిల్లా పరిషత్ సహకారంతో మొవ్వ మండలంలో శిక్షణ పొందిన 34 మంది మహిళలకు శుక్రవారం మొవ్వ ఎంపీడీఓ కార్యాలయంలో కుట్టుమిషన్లను జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పంపిణీ చేశారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో యువతకు ఉపాధి



అవనిగడ్డ: నైపుణ్యాభివృద్ధి శిక్షణ ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ద్వారా డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, హేచరీ ప్రొడక్షన్ వర్కర్ కోర్సుల్లో 52 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి కళాశాలలో జిల్లా అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ షేక్ అతావుల్లా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఉమారాణి, కళాశాల ఎస్‌పీఓసీ ఎం.రామారావు, ట్రైనర్ బి.జయసాయి, పృథ్వీజ, ప్రశాంత్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

గుడ్లవల్లేరు(వడ్లమన్నాడు): గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడులో శుక్రవారం గంగానమ్మ జాతర ఘనంగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో గ్రామ దేవత చెట్టు వద్దకు వెళ్లి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి జలవిహారం జరిగింది.